ఆంధ్రజ్యోతి

మహబూబాబాద్
ఆదివారం 12 జనవరి 2025

బసవన్నలే నేస్తాలు.. బతుకంతా కష్టాలు!



ఆదరణ కరువై.. బాగుపడని గంగిరెద్దుల వారి జీవితాలు

సంక్రాంతి వేళ కానరాని సందడి..

- ప్రభుత్వాలు మారుతున్నా అందని చేయూత
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం
- ఉండేందుకు ఇళ్లు లేని దీన స్థితిలో కుటుంబాలు

7

గంగిరెద్దుతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు (ఫైల్)

సండే స్పెషల్ SUNDAY SPECIAL

సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు.. పిండివంటల ఘుమఘుమలు.. పతంగులు, ముగ్గుల సందళ్లు.. డూడూ బసవన్నల విన్యాసాలు కనిపించేవి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా లోగిళ్లన్నీ కళకళలాడేవి. కానీ మారిన కాలమాన పరిస్థితులు.. పెరిగిన సాంకేతికతతో పండుగలు కళతప్పుతున్నాయి. సంక్రాంతి పండుగ అంటే గుర్తొచ్చే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఏళ్లకేళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. గంగిరెద్దులను ఆడించే వారిని పట్టించుకునే వారు లేక.. ఆ సంచార జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారాలను వదులుకోలేక.. గంగిరెద్దులను ఆడించే వృత్తినే జీవనాధారంగా చేసుకుని.. కష్టాలతో సావాసం సాగిస్తూ.. గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతూ ఆ కుటుంబాలు బతుకు సమరం సాగిస్తున్నాయి. ఎవరు ఆదరించినా.. ఆదరించకపోయినా.. బసవన్నల ఆటతో పూట గడవకపోయినా.. నమ్ముకున్న వృత్తిని వదిలేది లేదంటున్నాయి.

- రఘునాథపల్లి, ఆంధ్రజ్యోతి



మోడ్రన్ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వేం నరేందర్‌రెడ్డి

క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ పాలసీ

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ నిర్వహణ
- కేసముద్రాన్ని మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతాం
- రాజకీయాలకతీతంగా అభివృద్ధి
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- ఘనంగా మోడ్రన్ కబడ్డీ క్రీడలు ప్రారంభం

- వివరాలు 6లో

సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలు ఏంచేస్తున్నారన్న విషయంపై జాగ్రత్తలు వహించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలను బావుల్లో, చెరువుల్లో ఈత కొట్టేందుకుపంపించవద్దనానరు. ఈత నేర్పించాల్సిన అవసరం అయితే తల్లిదండ్రులే స్వయంగా పిల్లలకు ఈత నేర్పించాలన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు పిల్లలకు ఇవ్వకూడదన్నారు. ప్రత్యేక గదిలో పిల్లలను ఒంటిరిగా ఉంచడం వల్ల అనర్థాలకు దారి తీసే ప్రమాదముందన్నారు. స్నేహితులతో కలిసి దూర ప్రాంతాలకు పంపించకూడదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎస్పీ సూచించారు.

పల్లెకు పోదాం చలో.. చలో..

సంక్రాంతికి సొంతూళ్లకు పయనమైన జనం

రద్దీగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు ఖాళీ అవుతున్నాయి. ప్రజలంతా పల్లెబాట పట్టారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు తమ కుటుంబసభ్యులతో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు కదిలారు.దీంతో రైల్వేస్టేషన్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఎక్కడా చూసినా జనంతో కళకళలాడుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, రైళ్ల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇవి సరిపోకపోవడంతో ప్రజలుప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ ప్రాంతాలు ప్రయాణికులతో రద్దీగా కన్పిస్తున్నాయి.

విద్యార్థులు, ఉద్యోగులకు సెలవులు రావడంతో..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ నుంచి 17 వరకు విద్యాసంస్థలకు రాష్ట్రప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఉద్యోగులకు ఏటా సంక్రాంతి పండుగకు మూడురోజులు మాత్రమే సెలవులు వచ్చేవి. అయితే ఈ సారి అదనంగా పండుగకు ముందుగానే జనవరి 11న రెండో శనివారం, 12న ఆదివారం కలిసి వచ్చింది. 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగ సెలవులుండడంతో ఉద్యోగులకు సైతం అదనంగా రెండురోజులు సెలవులు కలిసి వచ్చాయి. విద్యాసంస్థలతో పాటు వారికి కూడా శనివారం నుంచేసెలవులు ఉండడంతో కుటుంబసభ్యులంతా కలిసి తమ సొంతూళ్లకు బయలు దేరారు. దీంతో ఆర్టీసీ బస్సులు, రైళ్ల ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సాధారణ సమయాల్లో బస్సులు, రైళ్లలో సీట్లలో కూర్చుని ప్రయాణించే ప్రయాణికులు ఇప్పుడు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ, రైల్వేశాఖ అదనంగా బస్సులు, రైళ్ల నడుపుతున్నప్పనటికి అవి కూడా సరిపోకపోవడంతో కొంతమంది సొంత వాహనాల్లో వెళ్తుంటే.. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. వ్యాపార, ఉద్యోగ, చదువుల రీత్యా పట్టణాల్లో నివాసముంటున్న వారంతా పల్లెదారి పట్టడంతో రోడ్లన్నీ వాహనాలతో కన్పిస్తున్నాయి. ఇక అత్తారింటి నుంచి మహిళలు పండుగకు పుట్టినింటికి రావడం, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు సంక్రాంతి పండుగకు గ్రామాలకు భారీగా తరలిరావడంతో పల్లెలన్నీ జనంతో కళకళలాడుతున్నాయి.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పట్టణాల్లో ఉన్న వారంతా పల్లెలకు చేరడంతో గ్రామాల్లో సంక్రాంతికి ముందే పండుగ శోభ సంతరించుకుంది. కాగా, సంక్రాంతి పండుగ కోసం గ్రామాలకు వచ్చే వారి సంఖ్య పెరగనున్న దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీమరిన్ని బస్సులను పెంచి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



డోర్నకల్ స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు



మానుకోట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

11 మండలాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

మహబూబాబాద్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 11 మండలాలకు సంబంధించిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుల, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించిట్లు పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబాబాద్ పట్టణాధ్యక్షుడిగా వెన్నమల్ల అజయ్, మానుకోట రూరల్ అధ్యక్షుడిగా బి.జహేందర్‌నాయక్, కేసముద్రం మండల అధ్యక్షుడిగా ఉప్పునూతల రమేష్, నెల్లికుదురు మండల అధ్యక్షుడిగా సీహెచ్.రాజ్‌కుమార్, గూడూరు మండల అధ్యక్షుడిగా ఆర్.వెంకటేశ్వర్లు, డోర్నకల్ అర్బన్ అధ్యక్షుడిగా జి.దేవ్‌సింగ్, డోర్నకల్ రూరల్ అధ్యక్షుడిగా బి.గణేష్‌నాయక్, దంతాలపల్లి మండల అధ్యక్షుడిగా భరత్‌గౌడ్, చిన్నగూడూరు మండల అధ్యక్షుడిగా జి.వేణు, మరిపెడ అధ్యక్షురాలుగా బి.మంగమ్మ, సీరోలు మండలఅధ్యక్షుడిగా జె.దిలీప్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గడ్డం అశోక్, నెల్లూరి సతీష్, పి.నర్సింహారెడ్డి, ఎం.మల్లయ్యగౌడ్, పర్నె ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్.రాంబాబు, సరెడ్డి రాణిరెడ్డి, జి.లక్ష్మణ్‌నాయక్, పి.మమత, జె.వీరన్నను నియమించినట్లు శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు.

కొత్త సహకారం

- రైతులకు మరింత చేరువగా సొసైటీలు
- జిల్లాలో పది నూతన పీఏసీఎస్‌లకు ప్రతిపాదనలు
- గూడూరు సొసైటీ పరిధిలో రెండు కొత్తవి
- ప్రస్తుతం 18 సొసైటీల్లో లక్ష మంది సభ్యులు

కేసముద్రం, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : 'ఒక్కరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు' నినాదంతో ఏర్పడిన సహకార సంఘాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లు రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీ ధరలతో విక్రయించడమేకాకుండా వాణిజ్యబ్యాంకుల తరహాలో ఖాతాదారులను ఏర్పర్చుకొని సేవలందిస్తున్నాయి. పెరుగుతున్న జనాభా, సభ్యుల (రైతుల) సంఖ్యకు అనుగునంగా సహకార సంఘాలను పెంచాల్సిన అవసరం ఏర్పడింది. 1987లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో మహబూబాబాద్ జిల్లా పరిధిలో 18 సహకారం సంఘాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నూతన మండలాలతో కలుపుకొని 18 మండలాలతో మహబూబాబాద్ జిల్లాగా ఆవిర్భవించింది. కాలానికిగనునంగా సహకార సంఘాల సంఖ్య పెంచకుండా ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 18 సహకార సంఘాలు ఉండగా ఇందులో 1,04,452 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. 2020, ఫిబ్రవరి 16న ఇప్పటి పాలకమండళ్లు కొలువుదీరగా ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి వీరి కాలపరిమితి ముగియనుంది. తిరిగి కొత్త పాలకమండలి ఎన్నికకు ముందేకొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలె జిల్లా అధికారుల నుంచి కొత్త సంఘాలకు ప్రతిపాదనలను స్వీకరించినట్లు సమాచారం.

సహకార సంఘాల విధులు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు, గ్రామీణ వర్గాలకు విస్తృతమైన వ్యవసాయ అభివృద్ధి, ఆర్థిక సేవలను అందిస్తాయి. సహకార సంఘం పరిధిలో వ్యవసాయ భూమి ఉన్న రైతులను సభ్యులుగా నమోదు చేసుకుంటాయి. సభ్యులుగా ఉన్న రైతులతో ఐదేళ్ల కాలపరిమితితో పాలకమండలిని ఎన్నుకుంటారు. రైతులకు వ్యవసాయ కార్యకలాపాల కోసం స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సహకార సంఘాలు అందిస్తాయి. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాల కొనుగోళ్లను తక్కువ ధరలకు అందిస్తాయి. ప్రభుత్వం నుంచి రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ రాయితీలను అందించే వేదికలుగా సహకార సంఘాలు వ్యవహరిస్తాయి. ప్రభుత్వ ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సహకార సంఘాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. పంట రుణాలను వసూలు చేయడంతోపాటు వాణిజ్య బ్యాంకుల తరహాలో పొదుపు ఖాతాల నిర్వహణ, వివిధ రకాల వ్యవసాయేతర రుణాల మంజూరు చేస్తున్నాయి. జిల్లాలో ధన్నసరి, నెల్లికుదురు, తొర్రూరు సహకార సంఘాల్లో క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేసి వాణిజ్య బ్యాంకు తరహాలో సేవలందిస్తున్నారు. తొర్రూరు సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు.

అంతేకాకుండా ఇటీవలె వివిధ రకాల ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలందించే 'కామన్ సర్వీస్ సెంటర్'(సీఎస్‌సీ) సేవలను సైతం సహకార సంఘాల్లో ప్రారంభించారు.



ధన్నసరి సహకార సంఘం భవనం

ప్రభుత్వం ఆమోదిస్తే..

మహబూబాబాద్ జిల్లాలో 18 సహకార సంఘాలు ఉండగా 11 సొసైటీల పరిధిలో కొత్తగా 10 పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి జిల్లా సహకార అధికారులు పంపించారు. ఇందులో గూడూరు సొసైటీ పరిధిలో అయోధ్యపురం, అప్పరాజుపల్లిలో నూతన సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. అలాగే కేసముద్రం పీఏసీఎస్ పరిధిలో కొత్తగా ఇనుగుర్తి, మరిపెడలో చిన్నగూడూరు, నర్సింహులపేటలో దంతాలపల్లి, తొర్రూరులో పెద్దవంగర, కొత్తగూడలో గంగారం, గార్లలో రాంపురం, బయ్యారంలో కంబాలపల్లి, కాంపల్లి సొసైటీ పరిధిలో సీరోలు పీఏసీఎస్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో అత్యధికంగా తొర్రూరు పీఏసీఎస్‌లో 10,358 సభ్యులుండగా మహబూబాబాద్ సొసైటీలో 9182 మంది సభ్యులు, బయ్యారంలో 9099, మరిపెడలో 8625, గూడూరులో 8405, శ్రీరాంగిరిలో7073, నర్సింహులపేటలో 6603, కురవిలో 4974, ఎర్రబెల్లిగూడెంలో 4609, కేసముద్రంలో 4446, పొగుళ్లపల్లిలో 4435, కాంపల్లిలో 4283, గార్లలో 4271, మన్నెగూడెంలో 4082, ధన్నసరిలో 4014, డోర్నకల్‌లో 3843, నెల్లికుదురులో 3793, గుండ్రాతిమడుగులో 2357 మంది సభ్యులున్నారు. ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలోనే ఆయా గ్రామాల్లో నూతన సంఘాల ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ, ఆర్థికపరమైన సేవలు మరింత చేరువకానున్నాయి.

నూతన సంఘాలతో రైతులకు ప్రయోజనం



నూతన సహకార సంఘాలకు రైతులకు, వివిధ వర్గాలకు సొసైటీ సేవలు చేరువ అవుతాయి. గత కొన్నేళ్లుగా కొత్త సంఘాల ఏర్పాటును ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన మండలాలతోపాటు ఇతర ప్రాంతాల్లోను నూతన సంఘాల ఏర్పాటు కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయం.

- చిన్నాల కట్టయ్య, ఇనుగుర్తి

మొన్న లగచర్ల.. నేడు మహదేవపూర్

- రైతుల ఆవేదన విన్నాకే ఇక్కడకు వచ్చా
- నియంతలా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు
- మాజీ స్పీకర్ మధుసూదనాచారి

మహదేవపూర్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులు రైతులను ఒప్పించి కట్టాలి కాని.. ఇలా నియంతలా వ్యవహరించి కట్టొద్దని మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మహదేవపూర్‌లో మరో లగచర్ల ఘటనను పునరావృతం చేస్తు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌తో కలిసి శనివారం మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం, బొమ్మాపూర్, సూరారం గ్రామాలకు చెందిన చిన్నకాళేశ్వరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ముందుగా ఎల్కేశ్వరం శివారులో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో కోల్పోతున్న భూములను పరిశీలించిన నాయకులు నిర్వాసిత రైతులతో మాట్లాడారు. అనంతరం లక్ష్మీపూర్ శివారులో పనులు చేపడుతున్న ప్రాంతానికి వెళ్ళి అక్కడి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పూర్తిగా వ్యవసాయమే జీవనాధారంగా బతికే రాష్ట్రం అని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ రోజు రైతుల సుఖంగా లేరని అన్నారు. గిట్టుబాట ధర నుండి మొదలు విత్తనాలు, ఎరువులు, కరెంటు, సాగునీటి, లోన్ల వరకు అనేక గోసలు పడ్డామని.. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయం పండగా అనేలా చేశామన్నారు. గడిచిన సంవత్సర కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. చిన్నకాళేశ్వరం భూనిర్వాసిత రైతులు ఆర్తనాదాలు విన్నాం కనుకనే ఈ రోజు ఇక్కడకు వచ్చామని అన్నారు. తమ నాయకుడు ఎన్నో భారీ నీటి ప్రాజెక్టులు చేపట్టి భూమితో పాటు అందులో ఉన్న పంటకు నష్టపరిహారం చెల్లించినట్లు గుర్తుచేశారు.


చిన్నకాళేశ్వరం కెనాల్ కోసం తీసిన ట్రెంచ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 60ఎకరాల పైచిలుకు భూమిలో ప్రాజెక్టు నిర్మించేందుకు పోలీసు పహారాతో పనులు చేపట్టడం దారుణమన్నారు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో పంటను నాశనం చేస్తూ పనులు చేయడం ఏంటని మండిపడ్డారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్న అధికారులు, నాయకులపై ప్రాసిక్యూట్ చేసి కేసులు పెట్టాలన్నారు. రైతులు పరిహారం అందలేదంటున్నారని.. తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

చిన్నకాళేశ్వరం సమస్య రైతులది కాదని.. ఇక నుంచి ఇది బీఆర్ఎస్ పార్టీదని అన్నారు. ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు.. రాష్ట్రానికి న్యాయం చేసే క్రమంలో సొంత నియోజవర్గ ప్రజలకు న్యాయం చేయకపోతే ఎలా అన్ని ప్రశ్నించారు. మానిఫేస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న శ్రీధర్ బాబు కాళేశ్వరం భూనిర్వాసిత రైతులకు పరిహారం రెట్టింపు చేస్తామని చెప్పి తన నియోజకవర్గంలోనే అమలు చేయడం లేదని విమర్శించారు. అనంతరం మంథని మాజీ శాసన సభ్యులు పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఒక్క మహదేవపూర్ మండలమే కాకుండ మహముత్తారం, కాటారం మండలాల్లోను ఈసమస్య ఉందన్నారు.

దీనిపై ప్రత్యేక జీవో తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే భూపాలపల్లి, పెద్దపల్లి కలెక్టర్లు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లింగంపెల్లి శ్రీనివాస్, నాయకులు అన్కారి ప్రకాశ్, అలీం ఖాన్, మార్క రాముగౌడ్, మహిళనాయకురాలు కేదారి గీతభాయి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కలల సాధానికి క్రెడాయి అద్భుత వేదిక

మంత్రి పొన్నం ప్రభాకర్ ▸ హనుమకొండలో క్రెడాయి ప్రాపర్టీ షో

హనుమకొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల కలల సాధానికి క్రెడాయి సంస్థ ఒక అద్భుత వేదిక అని, ఆ సంస్థలో గృహ నిర్మాణంతో పాటు గృహోపకరణాలు అందుబాటులో ఉంచడం గొప్ప విశేషమని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్‌లో క్రెడాయి జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రెడాయి ప్రాపర్టీ షో కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రెడాయి సంస్థ 1999 లో ఢిల్లీలో ప్రారంభమై అంచలంచెలుగా ఎదుగుతూ దేశ వ్యాప్తంగా రావడం గొప్ప పరిణామని అన్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టడంపై క్రెడాయి సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవలే ప్రజాప్రభుత్వ నాయకత్వంలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం గుర్తు చేశారు. రైలు మార్గం, ప్రధాన జాతీయ రహదారులు, విద్యా రంగాల్లో కాకతీయ యూనివర్సిటీ కిట్స్, ఎన్ఐటీ, వైద్య రంగంలో ఎంజీఎం, కాకతీయ మెడికల్ కాలేజీ ఉన్నాయన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధికి యోగ్యమైన ప్రాంతంగా హనుమకొండ నగరం ఉందని, క్రెడాయి లాంటి సంస్థ ప్రాపర్టీ షోలను నిర్వహించడం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రియల్టర్ కన్‌స్ట్రక్షన్లకు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత మేర రియల్ ఎస్టేట్ రంగం వెనక్కి తగ్గిందని, రానున్న రోజుల్లో మరింత వేగంగా పెరుగుతుందన్నారు.

అత్యవసర సేవలందించే ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు వైద్య సిబ్బంది కొనసాగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జ్ఞప్తి చేశారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం విడతల వారిగా అందిస్తుందన్నారు. రేషన్ కార్డు లేని వారికి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల వద్ద ప్రైవేటు ట్రావెల్స్‌వారు అధిక చార్జీలు వసూలు చేస్తే అనుమతులను రద్దు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, భూమి లేనివారికి రెండు విడతలుగా రూ.6వేల చొప్పున అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అజయ్‌కుమార్, జగన్, రాంరెడ్డి, రామచంద్రారెడ్డి, సీహెచ్. సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, ఎస్.అమరేందర్‌రెడ్డి, ఎస్. అమర్‌లింగేశ్వర్‌రావు, ఎం. రవీందర్‌రెడ్డి, జె. మనోహర్, ఎల్. రజినీకాంత్‌రెడ్డి, ఎం. రాజ్‌కుమార్, జి.రాజేందర్‌రెడ్డి, ఎం. వెంకటమల్లారెడ్డి, వరుణ్ కుమార్, అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


సరస్వతీ పుష్కరాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, గోదావరి సంగమ తీరంలోని పుష్కర ఘాట్లను కాశీ, హరిద్వార్, ప్రయగ పుణ్యక్షేత్రాల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ నది అంతర్వాహిని పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించేందుకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పర్వదినాల సందర్భంగా చేసే ఏర్పాట్లల కాకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలన్నింటిని అత్యాధునిక వసతులతో కళాత్మకంగా రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సరస్వతి పుష్కరాలు దేశంలో ఎక్కడా జరుగవేని కాళేశ్వర సంగమ స్థలంలో మాత్రమే వందల ఏళ్లుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. చత్తీస్‌గఢ్, తెలంగాణ, మహా రాష్ట్ర కూడలిలో గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే అత్యంత పవిత్రమైన సంగమమని తెలిపారు.

స్నానఘట్టాలను అత్యాధునికంగా నిర్వహించాలన్నారు. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన పనులు వేగవంతంగా కావాలన్నారు. హెలీకాప్టర్ల కోసం హెలీప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. దేవాదాయ, నీటి పారుదల, రోడ్ల భవనాలు, పంచాయతీరాజ్, రెవెన్యూ టూరిజం, ట్రాన్స్‌కో, ఆర్టీసీ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఉండ ప్రదేశంలో అత్యాధునిక బస్టాండ్‌ను నిర్మించాలన్నారు. వీధి దీపాల ఏర్పాటుకు ఇప్పటికే రూ 62 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 19 వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేకం పనులను ఎక్కడా లోపం లేకుండా చూడాలని తెలిపారు.

సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యార్, భపాఆలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, ఎస్ఈ దుర్గా ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, డీపీఆర్వో శ్రీనివాసరావు, ఆర్టీసీ డివిజన్ మేనేజర్ ఇందు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు11 మంది..

- ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌కు ఎంపిక
- వివిధ రంగాలకు చెందిన వారికి చోటు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం రోజున దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పలు రంగాలకు చెందిన 11 మందికి అవకాశం దక్కింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రం నుంచి మొత్తం 72మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేయగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 11 మంది ఉన్నారు. పరేడ్‌కు ఎంపికైన వారిలో పీఎం యశస్వి పథకం లబ్ధిదారులైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన జె.ప్రశాంత్, దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన బి గీతిక, వరంగల్ జిల్లా నర్సంపేట బీసీ బాలికల హాస్టల్‌కు చెందిన బీమగాని శాలిని, హ్యాండీక్రాఫ్ట్ విభాగంలో ములుగు జిల్లా మంగపేట మండలం దొమెడ గ్రామానికి చెందిన కొమురం ఆదిలక్ష్మి, గ్రామీణాభివృద్ధి విభాగంలో హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన దాసరి కల్పన, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన బండారి మంజుల, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎడ్ల అరుణ, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన మేక ప్రశాంతి కుమారి ఉన్నారు. ఇక పీఎం మత్స్య సంపద యోజన లబ్ధిదారైన వరంగల్ జిల్లా కుమ్మరివాడ ఉర్సుకు చెందిన బైరిశెట్టి పట్టాభి, ప్రధాని మన్‌కీబాత్‌లో పాల్గొన్నవారి నుంచి జనగామ జిల్లా వీవర్స్ కాలనీకి చెందిన చక్రాల సంతోష్ కుమార్, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లికి చెందిన గోనె మల్లయ్య ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయా పథకాల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల వ్యూరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రైతుభరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థికసహాయం అందించడానికి అవసరమైన జాబితా సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. వ్యూరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 16నుంచి ప్రారంభించి 20వతేదీ వరకు పూర్తి చేయాలని, 16నుంచి 18వతేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తిచేసి 19నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి తుది జాబితాను 20వతేదీన సమర్పించాలన్నారు.

21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి ప్రతి విభాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యత వహించేలా నియమించాలని, డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంట ఉంచుకుని డేటాను సక్రమంగా సమీక్షించి సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీవోలు, ఈడీఎం దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'సెపక్‌తక్రా'లో ఏఐపీ క్రీడాకారుల హవా

- పురుషులు, మహిళల డబుల్స్‌లో ప్రథమ స్థానం
- జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న చాంపియన్‌షిప్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ బండా ప్రకాష్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో డబుల్స్ పురుషుల, మహిళల విభాగంలో ఆలిండియా పోలీస్ (ఏఐపీ) క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండింటిలోనూ విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించారు. శనివారం హనుమకొండ జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో సెపక్‌తక్రా పురుషుల డబుల్స్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో బిహార్‌పై ఏఐపీ క్రీడాకారులు విజయఢంకా మోగించి ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో బిహార్, తృతీయ స్థానంలో తెలంగాణ, హరియానా క్రీడాకారులు నిలిచారు. అదేవిధంగా మహిళల విభాగంలో ఏఐపీ వర్సెస్ తెలంగాణ జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో తెలంగాణపై ఏఐపీ విజయదుందుభి మోగించగా తృతీయ స్థానంలో ఢిల్లీ, కేరళ రాష్ట్రాల జట్లు నిలిచాయి. టీమ్ ఈవెంట్ పురుషుల విభాగంలో ఢిల్లీపై మణిపూర్ జట్టు గెలుపొందగా ఎస్ఎస్‌బీ, అస్సాం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో నాగాలాండ్‌పై ఎస్ఎస్‌బీ జట్టు గెలుపొందగా తృతీయ స్థానంలో ఉత్తరప్రదేశ్, మణిపూర్ జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

ఈ క్రీడాపోటీలను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీల్లో విజయం సాధించాలని సూచించారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయి సెపక్‌తక్రా పురుషులు, మహిళలకు టీమ్ ఈవెంట్, డబుల్స్‌లలో జరిగిన ఫైనల్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా రెగో, కాడ్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్.ఆర్.ప్రేమ్‌రాజ్, ప్రధానకార్యదర్శి వీరాగౌడ్, కోశాధికారి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.


డబుల్స్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ పాలసీ

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ నిర్వహణ
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- ఘనంగా మోడ్రన్ కబడ్డీ క్రీడలు ప్రారంభం

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి నరేందర్‌రెడ్డి తండ్రి చెన్నకృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తంరెడ్డిల జ్ఞాపకార్థం వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలి రాష్ట్రస్థాయి మోడల్ కబడ్డీ అండర్ 17 బాలబాలికలు, సీనియర్ మహిళలు, పురుషుల పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రపంచస్థాయికి తీసుకువెళ్లేందుకు ఇటీవలె సీఎం కప్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని బావిస్తున్న ప్రభుత్వం గచ్చిబౌలి స్టేడియం వేదికగా చేసుకొని ప్రత్యేక క్రీడా విధానంతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేసముద్రానికి మంజూరైన 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు పెంచినట్లు తెలిపారు. మండలంలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, కేసముద్రంలో రోడ్ల విస్తరణను ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా చేపట్టాలని సూచించారు. ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో కేసముద్రం రాష్ట్రంలోనే మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వ ఏకపక్ష విధానాలు కాకుండా రాబో యే సంక్షేమ పథకాల్లో గ్రామసభల ద్వారానే లబ్దిదారులను ఎంపిక చేస్తూ పారదర్శకంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, మోడ్రన్ కబడ్డీ రూపకర్త, ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రాంరెడ్డి, కార్యదర్శి చెడుపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తేరాల శ్రీనివాస్, కొప్పుల శంకర్, హెచ్ఎం బీ రాజు, పీడీ కొమ్ము రాజేందర్ పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్


కేసముద్రంలో మోడ్రన్ కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


గంగిరెద్దులతో కళాకారులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

బసవన్నలే నేస్తాలు బతుకంతా కష్టాలు!

- ఆదరణ కరువై బాగుపడని గంగిరెద్దుల వారి బతుకులు
- సంక్రాంతి వేళ కానరాని సందడి
- ప్రభుత్వాలు మారుతున్నా అందని కనీస సాయం
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం

రఘునాథపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు పల్లెలు, పట్టణాల్లో ముగ్గుల లోగిళ్లు.. పతంగుల రెపరెపలు.. హరిదాసు కీర్తలు, గంగిరెద్దుల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలలో సందడి కనిపించేది. కానీ రానురాను సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. ఉరుకులపరుగుల జీవితంలో పూర్వరోజుల్లోలా పండుగలను జరుపుకొనేవారే కనిపించడం లేదు. ఇక సంక్రాంతి పండుగలో కీలకమైన బసవన్నలుగా పిలుచుకునే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఫలితంగా తరతరాలుగా వాటినే వృత్తిగా నమ్ముకున్న కుటుంబాలు దీనావస్థలో బతుకులీడుస్తున్నాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న గంగిరెద్దులను ఆడించే వృత్తినే జీవనాధారంగా ఎంచుకుని గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతున్నారు. సంచార జీవితం కావడంతో ప్రభుత్వాల నుంచి సరైన ఆదరణ లేక, కనీసం ఉండటానికి ఇళ్లు కూడా దీన స్థితిలో ఆయా కుటుంబాలున్నాయి. సంప్రదాయ కళను వృత్తిగా ఎంచుకుని బతుకుతున్న తమను పట్టించుకోవాలని గంగిరెద్దుల వారి కుటుంబాలు విన్నవిస్తున్నాయి.

అనాదిగా వస్తున్న ఆచారం..

దేవతల కాలంలో శివుడిని ఆరాధిస్తూ గంగిరెద్దుల ఆటతో దేవతలను మెప్పించిన వారిగా తమ తాత ముత్తాతల నుంచి ఇదే వృత్తిని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో నివాసముంటున్న బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్, ఆవుదొడ్డి రాజు చెబుతున్నారు. గంగిరెద్దుల ఆట కోసం పది నెలల నుంచి నాలుగేళ్ల వయస్సు వరకు ఉన్న ఎద్దులను కొనుగోలు చేసి వాటికి నిత్యం పచ్చగడ్డి వేస్తు ఆకు పసర్లతో తమ మాటలను వినేలా తర్ఫీదునిస్తూ తమ కనుగుణంగా గంగిరెద్దులను మలుచుకుంటామంటున్నారు. గుంటూరు, నవాబుపేట, కోదాడ, ఒంగోలు నుంచి రూ.40వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించి ఎద్దులను కొనుగోలు చేసి మూడు నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణనిచ్చి ఆటకు సిద్ధం చేస్తామని బత్తుల శ్రీను తెలిపారు.

ఇప్పటికీ దుర్భర జీవితం

సంక్రాంతి వచ్చిందంటే తెల్లవారు జామునే ఇంటింటికి తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తూ ప్రజల నుంచి ధాన్యం, డబ్బులు స్వీకరించే వీరు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా వీరి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. బతుకు దెరువు కష్టమై కూలీ పనులు చేసుకుంటూ జీవితాలు వెళ్లదీస్తున్నారు. బసవన్నల ఆటలతో అందరిని అలరించే వారి ఇళ్లల్లో సంక్రాంతి సంబరాలు కనుచూపుమేరలో కనిపించడం లేదంటే వారి జీవన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. బాధలను దిగమింగుతూ బసవన్నల ఆటలతో గ్రామాలలో సంక్రాంతి సంబరాల సందడి చేస్తు పెద్దలు, చిన్నలను అలరింపజేస్తున్న గంగిరెద్దుల కళాకారులు వారికి వారే సాటి అని నిరూపించుకుంటు అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆదరించే వారు లేక కష్టాలతో సావాసం చేస్తున్నారు.

ఆకట్టుకునేలా అలంకరణ

ఆటకు వెళ్లే ముందు బసవన్నలను అందంగా అలంకరిస్తారు. రంగురంగుల జాకెట్టు ముక్కలు, చీరలతో బొంతను తయారు చేసి బసవన్నలపై కప్పుతారు. అలాగే ఈత చెట్టు కమ్మలతో చాపలు అల్లి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్ది కొమ్ములకు తొడుగుతారు. మెడకు గజ్జెల పట్టి, కాళ్లకు గజ్జెలు కడతారు. ఒక్కో గంగిరెద్దును అలంకరించేందుకు సుమారు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుందట. బసవన్నలకు శిక్షణ ఇచ్చేటప్పుడు వాటికి 'అలగడం' కూడా నేర్పిస్తామని, ఆటలు ఆడే సమయాల్లో ఎక్కువ డబ్బుల కోసం అలిగేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని శ్రీను తెలిపారు. గంగిరెద్దు మనిషి ఛాతిపై ఆడడం, గంగిరెద్దు నోట్లో మెడ పెట్టడం, మోకాళ్లపై కూర్చుని నడవడం వంటి ఆటలను కూడా నేర్పిస్తామని చెప్పారు. ఎవరైనా చనిపోతే సమాచారం తెలుసుకుని గంగిరెద్దు విన్యాసాలు చేసి చూపించి డబ్బులు వసూలు చేసుకుంటామని తెలిపారు.

తాతల నుంచి ఇదే పని : బత్తుల శ్రీను



నా చిన్నప్పటి నుంచి గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్న. తాత ముత్తాతల నుంచి మాకు ఇదే వృత్తి ఆచారంగా వత్తాంది. సావు..బతుకులే మాకు బుక్కెడు బువ్వ కల్పిస్తయి. సంక్రాంతి పండుగప్పుడే మా చేతిలో చాలా పైసలు కనిపిస్తయి. పొట్ట కూటి కోసం గంగిరెద్దుతో ఊరూరు తిరుగుతున్నం.

పుట్టెడు కష్టాలు పడుతూ కళను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి మహేష్



గంగిరెద్దులను ఆడించే కళను బతికించడానికి పుటెడు కష్టాలు పడుతున్నాం. గంగిరెద్దులతో సంచార జీవనం సాగిస్తూ పొట్ట పోసుకుంటున్నాం. ఉండటానికి సొంత ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి దుస్తులు కూడా కరువయ్యాయి. ఆదరణ కోల్పోతున్న కళకు జీవం పోయడానికి బతుకు భారమవుతున్నా.. కష్టాలకు ఎదురీదుతూ బతుకు పోరు సాగిస్తున్నాం. గంగిరెద్దులు ఆడిస్తే వచ్చే ఆదాయం కుటుంబం పోషించడానికి సరి పోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

బసవన్నల ఆటను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి రాజు



బసవన్నల ఆటను బతికించడానికి ఎన్నో కష్టనష్టాలు పడాల్సి వస్తోంది. బసవన్నల ఆటకు ప్రజల ఆదరణ తగ్గడంతో బుక్కెడు బువ్వ కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణ రాష్ట్రం సాకారమైనంక కూడా మా బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. ఎవ్వరు మమ్ములను పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ యాస, బసవన్నల ఆటను బతికిస్తున్న మాకు సర్కారు సరైన ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలి.


బట్టల బజార్‌లో సంక్రాంతి నోముల సామగ్రి అమ్మకాలు

ఇంటింటా సంక్రాంతి సందడి

- నోములతో మహిళలకు సౌభాగ్యం
- పూజా సామగ్రి కొనుగోలులో మహిళలు బిజీ

వరంగల్ చౌరస్తా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలతో ధనధాన్యాలతో ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ సంక్రాంతి. సోమవారం భోగి పండుగ, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకోనున్న నేపథ్యంలో ఇంటింటా సందడి మొదలైంది. మూడు రోజుల పాటుసాగే పర్వదిన వేడుకల్లో భాగంగా మహిళలు సంక్రాంతి రోజున ప్రత్యేక నోములు ఆచరిస్తారు. కలకాలం తాము ముత్తైదువుగా ఉండాలని, పిల్లాపాపలు, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. మరునాడు బంధు మిత్రులను, ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి నోమును వాయినంగా ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు.

పూజా సామగ్రికి పెరిగిన గిరాకీ

సంక్రాంతి పర్వదినం వస్తుందంటే మహిళలు నోములు నోచుకోవడానికి ఉపయోగించే పూజా సామగ్రి దుకాణాలు కళకళలాడుతాయి. వరంగల్ బట్టల బజార్, చౌరస్తా, స్టేషన్‌రోడ్డు, పాపయ్యపేట చమన్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తారు. ఈసారి పది రోజుల క్రితమే ప్రారంభించారు.

నోముకునే విధానం

తాము కలకాలం ముత్తైదువుగా ఉండాలని వేడుకుంటూ మహిళలు 13 రకాల వస్తువులతో నోముకుంటారు. ప్రధానంగా టిఫిన్ బాక్స్‌ల నుంచి బకెట్లు చిన్నచిన్న స్టీల్ సామానులాంటి 13 రకాల గృహోపకరణాలను కొని వాటిలో పసుపు కుంకుమ, రేగుపండ్లు, నువ్వుల ముద్దలు, పోకలు, గాజులు, చేబియ్యం, కంకణం, రవికబట్టలు అమ్మవారి ముందు పెట్టి మంగళహారతులు పలుకుతారు. మరునాడు 13 మందిని ఇంటికి పిలిచి తల ఒక నోము అందజేసి ఆశీర్వచనం పొందుతారు.


పతంగుల దుకాణంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న మాంజా దారాలు

చైనా మాంజాతో పైలం

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, వన్య ప్రాణులు
- పోలీసులు చర్యలు చేపట్టినా.. ఆగని విక్రయాలు

జనగామ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వచ్చిందంటే.. గాలిపటాల రెపరెపలు కనిపిస్తుంటాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొడతుంటారు. అంతేకాదు ఎదుటి వారి గాలిపటాలను తెగ్గొట్టాలన్న తాపత్రయం.. వారిని మించి ఎగురవేయాలన్న పట్టుదలతో ప్రమాదకర చైనా మాంజాను వాడుతున్నారు. దాంతో సంతోషాన్ని నింపాల్సిన పతంగులు విషాదాన్ని మిగుల్చుతున్నాయి. అత్యంత పదునుగా, బలంగా ఉండే చైనా మాంజా మనుషులకే కాదు, జంతువులు, పక్షులకు కూడా ముప్పు తెస్తోంది. చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయని 2016లో ప్రభుత్వం విక్రయాలను నిషేధించింది. అయినా గుట్టుచప్పుడు కాకుండా మాంజా విక్రయిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్నా పరిస్థితి మారడం లేదు. కొంత మంది వ్యాపారులు కాసుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధిక ధరలకు చైనా మాంజా విక్రయిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. గాలిపటాల పోటీలో తెగిపడిన దారాలు చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు, భవనాలపై పడుతున్నాయి. వాహనాలపై వేగంగా వెళ్తున్న వారికి మాంజా తగిలి గాయపడుతున్నారు. సన్నగా, దృఢంగా ఉండే ఈ దారాన్ని చేతులతో, పళ్లతో తెంచే ప్రయత్నం చేస్తే ప్రమాదమే.

ఉమ్మడి జిల్లాలో పలు సంఘటనలు

చైనా మాంజాలో ప్రమాదకర గాజు పొడి, అల్యూమినియం ఆక్సైడ్‌తో పాటు గట్టితనం కోసం సింథటిక్ ఫైబర్ కలుపుతారు. దీంతో ఈ మాంజా తగిలితే చర్మం కోసుకుపోతుంది. వారం రోజుల క్రితం జనగామ పట్టణంలో చైనా మాంజా తగిలి కొందరు పిల్లలు, యువకులు గాయపడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి. జనగామ జిల్లాలోని బచ్చన్నపేటకు చెందిన ఎస్.సనత్‌కుమార్, సాయిరాం, సాయికుమార్ జనగామలోని సిద్దిపేట రోడ్డు వైపు వంతెనపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాలిపటానికి చెందిన మాంజా దారం తగలడంతో సనత్‌కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. సాయిరాం, సాయికుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ద్విచక్రవాహనం పై తల్లిదండ్రులతో కలిసి ప్రయాణిస్తున్న పదేళ్ల బాలుడు వీక్షిత్‌కు గొంతు భాగంలో దారం తగలడంతో తీవ్ర గాయమైంది. నిషేధిత మాంజా దారాల విక్రయాలపై అటవీ, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

మాంజా విక్రయాలు చేపడితే చర్యలు

దామోదర్‌రెడ్డి, సీఐ, జనగామ



సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో పతంగులు విక్రయాలు చేసేవారు నిబంధనలు పాటించాలి. చైనా మాంజా విక్రయాల నేపథ్యంలో ఇప్పటికే పలు షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. అత్యంత ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను విక్రయించొద్దు. ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

జైలు శిక్ష, జరిమానా

చైనా మాంజాతో పొంచి ఉన్న ముప్పును గ్రహించే రాష్ట్ర ప్రభుత్వం 2016లో వీటి విక్రయాలపై నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం చైనా మాంజాను కొనుగోలు చేసినా, విక్రయించినా నేరంగా పరిగణిస్తారు. దీనిని ఉల్లంఘించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. జంతువులు, పక్షులకు హాని కలిగిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 3 నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలతో పోలీసులు మాంజా విక్రయాలపై కన్నేసారు. పతంగుల దుకాణాలపై విస్తృతంగా మూకుమ్మడి దాడులు చేపట్టారు. చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. అయినా చాటుమాటుగా చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.


ప్రమాదానికి గురైన సనత్‌కుమార్ (ఫైల్)


గాయపడిన వీక్షిత్ (ఫైల్)

జయహో 'యువత'

సామాజిక బాధ్యతగా పలు అంశాల్లో సేవలు


ఎన్‌వైకే ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం (ఫైల్)

భవితకు దిక్సూచిగా ఎన్‌వైకే

- యువత భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు
- నేడు ఇండోర్ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయడానికి ఉద్దేశించిన నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకే).. ఆ దిశగా పలు కార్యక్రమాలను చేపడుతోంది. హనుమకొండ బాలసముద్రంలోని ఈ కేంద్రం యేడాదిగా నిర్వహించిన అనేక సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువతీ, యువకులు, యువజన సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. నేడు వివేకానంద జయతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఎన్‌వైకే కార్యకలాపాలపై కథనం

ట్రాఫిక్

పర్వదినాల రోజు పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని నెహ్రూయువ కేంద్ర సరిగ్గా దీపావళి పండుగ రోజు ట్రాఫిక్ అవగాహన ట్రాఫిక్ పోలీసులకు సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్‌వైకే ఆధ్వర్యంలో పలువురు యువతీ యువకులు దీపావళి రోజు ఉదయం 8 గంటలకే రోడ్లమీదికి వచ్చి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులకు స్వచ్ఛందంగా సాయపడ్డారు. పనిలో పనిగా ట్రాఫిక్ రూల్స్ రాసిన, వాహనాలను నడిపేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు రాసిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులకు, సామాన్య ప్రజలకు అవగాహన కలిగించారు.

ఆస్పత్రుల్లో స్వచ్ఛత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బయోవ్యర్థాలు, మరుగుదొడ్ల నుంచి వెలువడే దుర్వాసనను దృష్టిలో పట్టుకొని ఎన్‌వైకే పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఆస్పత్రులను ఊడ్చి శుభ్రం చేశారు. రోగలకు ఆహారం, మందులు అందించడం, వైద్య పరీక్షల కోసం వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై రోగులకు ల్యాబ్‌ల వద్దకు తీసుకువెళ్లడం వంటి పనులు చేశారు.

మార్కెట్లు శుభ్రం

నగరంలోని కూరగాయాల మార్కెట్‌లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పారపోసిన కుళ్లిపోయిన, పుచ్చులున్న కూరగాయాలను, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యువతీ యువకులు శుభ్రం చేశారు. మార్కెట్లను ఊడ్చి చెత్తను తొలగించి వాటిని శుభ్రం చేశారు. మార్కెట్లతో పాటు వేయిస్తంభాల గుడి, ఇతర ప్రార్థనా స్థలాలను సైతం పరిశుభ్రం చేశారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మాదక ద్రవ్యాలపై ఎన్‌వైకే అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. పోలీసు అధికారులతో కౌన్సెలింగ్ ఇప్పిచ్చింది. ఇందులో భాగంగా ఇటీవల బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీలో డ్రగ్స్‌వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన సదస్సులో ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు పోలీసు ఉన్నతాధికారుల పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఎన్‌కేవై ఆధ్వర్యంలో యువతీ యువకులతో పెద్ద ఎత్తున ర్యాలీలను నిర్వహించారు.

క్రీడా పోటీలు

నెహ్రూ యువ కేంద్ర బ్లాక్ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికిపైగా యువజన సంఘాలు ఉన్నాయి. ఈ ఆటల పోటీల నిర్వహణ బాధ్యతను వాటికే అప్పగించడం ద్వారా వాటిని క్రియాశీలం చేస్తోంది. గ్రామస్థాయిలో సామాజిక రుగ్మతలపై యువతతో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తోంది.

మై భారత్‌తో అనుసంధానం

వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, యువత సాధికారతను ప్రోత్సహించే వర్క్‌షాపుల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మైభారత్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. పోర్టల్ భాగస్వా మ్యంతోనూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మైభారత్‌లో యువత క్రియాశీల భూమిక పోషించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యూత్ క్లబ్‌ల ఏర్పాటు, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంక్లిష్టంగా మార డంతో యూత్ క్లబ్‌లూ వలంటీర్లను ప్రోత్సహిస్తున్నారు.

నేడు యువజనోత్సవం

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు నెహ్రూయువ కేంద్ర కోఆర్డినేటర్ అన్వేష్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీన జేఎన్ఎస్ స్టేడియంకు ఎదురుగా గల ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో యూత్ అవార్డులు పొందినవారిని సత్కరించనున్నామన్నారు. అంతేకాకుండా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి ఇవ్వనున్న సందేశాన్ని డిజిటల్ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు చెప్పారు. ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అంశాలపై యువజనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

చేయూతనిచ్చే మై భారత్

- నాలుగు అంశాలతో అనుసంధానం
- విభిన్న రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం

నేడు జాతీయ యువజన దినోత్సవం

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే యువత అన్ని రంగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ మన భారత్ (మైభారత్) పేరిట పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. తమ పరిధులను విస్తృతం చేసుకోవాలని, తమ జీవితంలో మార్పు తీసుకురావాలని, తమ కలలవైపు నడిచేలా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని కాంక్షించే యువతకు మై భారత్ ఒక ప్లాట్‌ఫారమ్. యువతకు వివిధ స్వయం సేవకంగా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడానికి, నైపుణ్యాన్ని ఏర్పరచుకోవడానికి, కమ్యూనిటీలలో సానుకూల ప్రభావాన్ని సృష్టించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని మై భారత్ పోర్టల్ కల్పిస్తుంది. నేడు స్వామివివేకానంద జయంతి. ఈ రోజును జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని యువతీ యువకుల అవగాహన కోసం మైభారత్ పోర్టల్‌పై కథనం.

యువతకు భాగస్వామ్యం

మైభారత్ పోర్టల్‌లో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది. ఈ పోర్టల్‌లో చేరిన యువతను అభివృద్ధివైపు మళ్లించడం, సాధికారత సాధించేలా చేయూత నివ్వడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంచేందుకు గత ఏడాది అక్టోబరు 31న ప్రధాని నరేంద్ర మోదీ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ-లర్నింగ్ పోర్టల్ ద్వారా వివిధ రకాల అంశాలకు సంబంధించి తర్ఫీదు ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగ అవకాశాలు, పలు రకాల కోర్సులు, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా నైపుణ్య సమాచారం ఈ పోర్టల్ ద్వారా లభ్యమవుతుంది.

లక్ష్యాలు

డిగ్రీలు చేతపట్టుకున్న యువత ఉద్యోగవేటలో అలసిపోతున్నారు. నైపుణ్యం ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువైంది. ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నా పొందలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేక పరిశ్రమలు స్థాపించడంలో ఔత్సాహికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాదు.. ప్రైవేటులో నిలదొక్కుకునేందుకు మై భారత్ పోర్టల్ వేదిక అవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గనిర్దేశనం చేయనున్నారు.

అనుసంధానం

మై భారత్ పోర్టల్‌ను నాలుగు అంశాలతో అనుసంధానం చేశారు. ఒకటి - ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన. వీటిని వినియోగించుకునేందుకు అర్హతలను ఈ పోర్టల్ ద్వారా వివరిస్తారు. రెండోది - ఎంచుకున్న రంగంలో ప్రతిభా నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశాలు, నైపుణ్య సాధనకు అందుబాటులో ఉన్నవాటిపై అవగాహన కల్పించడం. మూడోది - సామాజిక బాధ్యతను చేర్చి యువత ఉజ్వల భవితకు బాటలు వేసే సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు అమలు చేయడం. నాలుగోది - వ్యాపారంలో రాణించేలా యువతను ప్రోత్సహించడం. వ్యాపారాన్ని ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ)లో రాయితీ, ఎలా రుణం పొందాలో ఈ పోర్టల్‌లో ఉంటుంది. వ్యాపార, పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలను నివృత్తి చేయడం.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

యువతీ, యువకులు స్వయం ఉపాధికి సంబంధించిన సమాచారం పొందాలంటే ప్లే స్టోర్‌లోకి వెళ్లి మై భారత్ పోర్ట ల్‌లో చేరేందుకు లాగిన్ కావాలి. పుట్టినరోజు, నెల, సంవత్సరం, రాష్ట్రం, జిల్లా, గ్రామం, పట్టణం ఇలా సమాచారం నమోదు చేయాలి. తర్వాత ఈ-మెయిల్ ఐడీతో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌వైకే, ఇతరులు ఇలా ఏ కేటగిరిలో ఉన్నారో దాన్ని క్లిక్ చేయాలి. 15-29 ఏళ్ల లోపు యువత దీనిలో సభ్యత్వం తీసుకునే వెసులుబాటు కల్పించారు.

నమోదు వివరాలు

మై పోర్టల్‌లో విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఈ పోర్టల్‌లో భాగస్వామ్యం కావడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 68,042 మంది యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో హనుమకొండ జిల్లాలో 15,959 మంది, వరంగల్ జిల్లాలో 13,669, జనగామ జిల్లాలో 11,066, మహబూబాబాద్ జిల్లాలో 9,599, ములుగు జిల్లాలో 8,150, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,599 మంది నమోదయ్యారు.

కుష్టు నిర్ధారణ పరీక్షలు

దంతాలపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కవిత మాట్లాడుతూ 21 గ్రామ పంచాయతీ పరిధిలో 22 మందిని పరీక్షించి, ఇద్దరికి కుష్టువ్యాధి ఉన్నట్లు నిర్ధారణ చేశామన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రజలు భయపడొద్దన్నారు. ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన మందులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వ్యాధి నిర్మూలన డీపీఎం వనకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు భీమానాయక్, సుజాత, హెల్త్‌అసిస్టెంట్‌లు మిట్టకోల సత్యనారాయణ, శ్రీనువాస్ పాల్గొన్నారు.

మహనీయుడు వడ్డె ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహనీయుడు వడ్డె ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆయన జీవితం అందరికి ఆదర్శనీయమని, ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి ప్రధాన సహచరుడిగా వడ్డె ఓబన్న బ్రిటీష్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన తీరు చరిత్రలో నిలిచి పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నర్సింహాస్వామి, జడ్పీ సీఈవో పురుషోత్తం, మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, వడ్డెర సంఘం ప్రతినిధులు గుంజె హన్మంతు, పిండ్రాల రాందాసు, సంపంగి రాంచంద్రు, నాగలక్ష్మి, బండారు చిరంజీవి, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

క్రైం కార్నర్

నల్లబెల్లం, పటిక పట్టివేత

- ఐదుగురిపై కేసు నమోదు

నర్సింహులపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రామన్నగూడెం పూసలతండాలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకొని.. కారు, బొలెరో, ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. నెల్లికుదురు మండలం తారసింగ్‌బావి తండాకు చెందిన వినోద్, దంతాలపల్లి మడలంలోని దుబ్బతండాకు చెందిన యాకూబ్, రమేశ్, మరిపెడ మండలం దుబ్బతండాకు చెందిన వీరన్న, నర్సింహులపేట మండలం పూసలతండాకు చెందిన చోక్యాతో పాటు మరొకరు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారు జామున బెల్లంలోడుతో ఉన్న బొలెరో వాహనానికి ముందు ఎస్కాట్‌గా కారు, ఎక్సెల్ ద్విచక్రవాహనం వెళ్తున్న క్రమంలో పక్కా సమాచారంతో దాడి చేశారు. బొలెరో వాహనంలో ఉన్న సుమారు 25 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటికను స్వాధీనం చేసుకొని, కారు, బొలెరో, ద్విచక్రవాహనాలను సీజ్‌చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నిషేధిత దందాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్సై సురేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పాక్సో కేసు నమోదు

నర్సింహులపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన గుగులోతు శంకర్‌నాయక్‌పై పోక్సోకేసును నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక (17)ను మాయమాటలు చెప్పి గురువారం అత్యాచారయత్నానికి ప్రయత్నించినట్లు తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కమిషనర్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై..

డోర్నకల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి శనివారం మెయిన్‌రోడ్డులోని ఓ టిఫిన్‌సెంటర్ నిర్వాహకుడిని తోపుడు బండిరోడ్డుపై నుంచి తీయాలని కోరాడు. దీంతో సదరు టిఫిన్ సెంటర్ యాజమాని కమిషనర్ విధులకు ఆటంకం కలిగించి అతడిపై అనుచితంగా ప్రవర్తించాడు. కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిఫిన్ సెంటర్ యాజమాని జక్కుల వీరస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో..

జగ్యాతండాలో చందావత్ రత్తియా ఈనెల 6న తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా మల్లాయికుంట తండా శివారు దాన్యతండాకు చెందిన వాంకుడోతు కల్యాణ్ వెనుక నుంచి వచ్చి రత్తియాను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో రత్తియాకు పలుచోట్ల గాయాలయ్యాయి. బాధితుడు రత్తియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

తొర్రూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసంకష్టపడి పనిచేయాలని, అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా సమన్వయం పాటిస్తూ కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఝాన్సీరెడ్డి

కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాలి

తొర్రూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆ సంఘం రెండో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. పట్టణాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి మురికికాలువలు తీస్తూ కొవ్వొత్తుల్లా కరుగుతున్న మునిసిపల్ కార్మికుల జీవితాలను పట్టించుకునే వారు లేరని విమర్శించారు. మునిసిపాలిటీల్లో ఈఎస్ఐ, పీఎఫ్ నిధులు జమచేయకుండా అలసత్వం వహిస్తున్నారన్నారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే మునిసిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నాయకులు మహేందర్, ప్రసాద్, వెంకన్న, రామస్వామి, భిక్షపతి, శ్రీరాములు, మురళి ఉన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మునిసిపల్ కార్మికులు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కురవి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచినానిరుపేద ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. కురవిలో శనివారం జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి నూతన రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్‌లు, ఇందిరమ్మ ఇండ్లు అందించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే గ్రామసభలు ఏర్పాటు చేసి నిజమైన లబ్ధిదారులందరికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలన్నారు. పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేస్తూ సభ్యత్వ నమోదు పూర్తిచేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, తురక రమేష్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

సభను విజయవంతం చేయండి

- తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి



కొత్తగూడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నాయకులు

కొత్తగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 23న హన్మకొండలోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. కొత్తగూడలో శనివారం తుడుందెబ్బ ఉమ్మడి మహాసభ కరపత్రాలను తుడుందెబ్బ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12 నిర్వహించాల్సిన సభను అనివార్యకారణాల వలన రద్దు చేసి, ఈనెల 23న నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్లు కుంజ నర్సింగరావు, వాసం రవి, అల్లెం జంపయ్య, మండల కన్వీనర్ ఈక విజయ్‌కుమార్, కోకన్వీనర్ వజ్జ రవి, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంస్కృతిని తెలియజేసేందుకే వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు వివిధ పర్వదినాల ప్రాముఖ్యత, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకు వికాస్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు, కళాశాల చైర్‌పర్సన్ ఇందిర తెలిపారు. మహబూబాబాద్‌లోని స్థానిక వికాస్ విద్యాసంస్థల్లో శనివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొనిముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని మూడురోజులు తొలిరోజు భోగి, రెండోరోజు సంక్రాంతి, మూడోరోజు కనుమలను జరుపుకుంటారని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు సునీత, వెంకటేశం, వెంకన్న, సారంగం, నాగవిజయ్, నరేష్, రాజు, బిక్షపతి, యాకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, చైర్ పర్సన్ ఇందిర

పాఠశాల స్థాయి నుంచే పండుగల విశిష్టతలు తెలియాలి

మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పండుగల విశిష్టతను తెలియజేసేందుకు పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు మహర్షి విద్యాలయ కరస్పాండెంట్ ఎం.సుధాఅర్జున్‌రెడ్డి, డైరెక్టర్ సూర్యకుమారి అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక పాఠశాలలో శనివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుధాఅర్జున్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధనతో పాటు వివిధ పండుగల వేడుకలు నిర్వహించడం వలన సంస్కృతి, సాంప్రదాయాలు పెంపొందించడం జరుగుతుందన్నారు. జడ్జీలుగా పర్కాల హేమలతారెడ్డి పాల్గొన్నారు



మహర్షి విద్యాలయంలో ముగ్గులను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి, జడ్జీలు

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి సత్యనారాయణ ఎంపిక



మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి తెలంగాణ రచయితల వేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీకళా వేదిక ఏటా ఇచ్చే తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారానికి ఇచ్చే అవార్డుకు ఎంపికైనట్లు సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్ నుంచి ఆహ్వానం అందినట్లు సత్యనారాయణ శనివారం తెలిపారు. శ్రీశ్రీకళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారం అందుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ శ్రీ కొత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈనెల 21న జరిగే కార్యక్రమంలో సత్యనారాయణను సత్కరించనున్నారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ గత రెండు దశాబ్దాలుగా సాహిత్య వ్యాసాంగం కొనసాగిస్తూ అనేక జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. తెలుగుభాష, సంస్కృతి, సాహిత్యం కళల పరిరక్షణ కోసం నిరంతరం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో రాణిస్తున్న సత్యనారాయణకు తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారంకు ఎంపిక కావడం పట్ల మానుకోట పట్టణానికి చెందిన కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

డీటీఎఫ్ మానుకోట మండల కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండల డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు మాధవ్ తెలిపారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలోమండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శిగా దేవేందర్‌రాజు, ఉపాధ్యక్షులుగా నాగరాజు, విద్యాసాగర్, కార్యదర్శులుగా రవి, వీణ, కుమారస్వామి, జిల్లా కౌన్సిలర్లుగా విజయ్ కుమార్, వెంకన్న, నరేందర్, కామేశ్వర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అశోక్‌రెడ్డి, సభ్యులుగా తిరుపతి, రాములులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భీముడు, నర్సింగరావు, పెంట్య, రాములు, కుమారస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు : బీఆర్ఎస్

తొర్రూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన వైఫల్యాలను ప్రశ్నించే వ్యక్తులపై కేసులు పెట్టడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షు డు సీతారాములు అన్నారు. శనివారం తొర్రూరులో గిరిజన యువకుడు రాజ్‌కుమార్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వెంటనే రాజ్‌కుమార్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు డాక్టర్ సోమేశ్వర్ రావు, మంగళపల్లి శ్రీనివాస్, టీసీ అంజయ్య, ఈదురు ఐలయ్య, బిందు శ్రీను, ఆశయ్య, ఆర్. వెం కన్న, అంకుష్, కుర్ర శ్రీను, ప్రమోద్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాములు

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కేసముద్రం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల ఆదర్శ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం ఈనెల 6 నుంచి వచ్చేనెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పరిమి నవీన్ కోరారు. ఆరో తరగతిలో వంద సీట్లు ఉండగా మిగిలిన తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వ్రతం



శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం ధనుర్మాసవ్రతం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు బాగవతుల వంశీ కృష్ణమాచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంజరోత్సవం, కుదారై ఉత్సవం పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

'ఏక్ కా డబుల్' పేరుతో మోసం

- మహిళ ఆత్మహత్యాయత్నం
- మరిపెడ గ్యామతండాలో ఘటన
- ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స.. పరిస్థితి విషమం

మరిపెడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏక్ కా డబుల్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేసిన మోసం ఓ వివాహిత ప్రాణాలపైకి తెచ్చింది. డబ్బులు పెట్టి మోసపోయానని గ్రహించిన ఆమె మనస్తాపంతో శుక్రవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసి.. మృత్యువుతో పోరాడుతోంది. ఈ సంఘటన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని గ్యామతండాలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గ్యామతండాకు చెందిన గుగులోత్ శైలజకు వారంక్రితం ఓ అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి, మాటమాట కలిపి రూపాయికి రూపాయి లాభం వస్తుందని ఆశచూపాడు. అందుకోసం వారు ఆమెకు ఓటీపీ పంపి.. తొలుత రూ.5వేలు పెట్టించి రూ.10వేలు ఇచ్చారు. అలాగే మరోసారి రూ.50వేలు పెట్టగా రూ.60వేలు ఇచ్చారు. దీంతో వారిని నమ్మిన ఆమె ఏకంగా రూ.2లక్షలు చెల్లించింది. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాళ్లు మరో రూ.4లక్షలు చెల్లిస్తే రూ.20లక్షలు వస్తాయని నమ్మబలికారు. కానీ అప్పటికే తాను చెల్లించిన రూ.2లక్షలు రాకపోవడం, ఈ లోపు విషయం కుటుంబసభ్యులకు తెలియడంతో అప్రమత్తమైంది. కానీ ఈ విషయం బయటకి పొక్కడంతో మనస్తాపానికి గురైన ఆ మహిళ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు శైలజను ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నెల్లికుదురు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతీనెల 1న గ్రామపంచాయతీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ప్రకటించడంతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామపంచాయతీ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమ ఇబ్బందులు గుర్తించి, వేతనాలు వేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ ఉద్యోగులు దుబార్ల సాయిలు, కోయ్యేడి రమేష్, రవి, సునిల్, యాకాలు నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జీపీ ఉద్యోగులు

హర్షిత్‌కు పర్యావరణ ప్రేమికుడి జాతీయ అవార్డు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన ధైద హర్షిత్ బెస్ట్ పర్యావరణ ప్రేమికుడి జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో శనివారం హైకోర్టు జడ్జీ చంద్రకుమార్, హాస్యనటుడు శేషు చేతుల మీదుగా హర్షిత్ బెస్ట్ పర్యావరణ ప్రేమికుడి జాతీయ అవార్డు అందుకున్నారు. హరిత మిత్ర అవార్డు గ్రహీత ధైద వెంకన్న కుమారుడు హర్షిత్ తండ్రిని ఆదర్శంగా తీసుకొని 3వ తరగతి చదివే నాటికే 10 వేల మొక్కలు పంపిణీ చేసినందుకుగాను ఈ అవార్డుతో సన్మానించారు. విద్యార్థి హర్షిత్‌కు బెస్ట్ పర్యావరణ ప్రేమికుడి జాతీయ అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



హైకోర్టు జడ్జీ చంద్రకుమార్, హాస్యనటుడు శేషు చేతుల మీదుగా అవార్డు అందుకున్న హర్షిత్

టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్ పరీక్షలు షురూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శనివారం టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ స్కూల్లో లోయర్, హైయ్యర్ పరీక్షలకు 336 మంది హాజరు కానుండగా 252 మంది హాజరు కాగా, 91 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఎంబ్రాయిడింగ్ లోయర్‌కు 78 మంది పరీక్షకు హాజరు కానుండగా 49 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఉషోదయ వాకర్స్ ఆధ్వర్యంలో రేపు వాకింగ్, చిర్రగోనె, గోలి ఆటలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 13న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్, చిర్రగోనె, గోలీ ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి విష్ణువర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం భోగి మంటల కార్యక్రమ అనంతరం వాకర్స్ మధ్య ఐక్యమత్యం, స్నేహ భావం పెంపొందించే విధంగా చిన్ననాటి ఆటలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 40, 50, 60 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తులకు వేర్వేరుగా బ్యాచ్‌ల వారీగా వాకింగ్ పోటీలను జరుపుతామన్నారు. అనంతరం చిన్ననాటి ఆటలు గోటిబిళ్ల (చిర్రగోనె), గోలీలాట (గుండం), టైర్ ఆటలను నిర్వహించి ప్రస్తుతతరానికి పూర్వఆటల గూర్చి తెలియజేసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు డోర్నకల్‌లో ముగ్గుల పోటీలు

డోర్నకల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆఫ్ డోర్నకల్ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 12న స్థానిక జడ్పీ హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గొట్టిగండ్ల మధు తెలిపారు. డోర్నకల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు అందరికి కన్సలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. పాల్గొనేవారు ముగ్గుకు అవసరమైన రంగులు, ఇతరత్రా సామగ్రిని తెచ్చుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ సెక్రటరీ యశోదర్‌జైన్, ట్రెజరర్ కందుల నరేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమీ లేదు'

గార్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ విమర్శించారు. శనివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో అపార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కార్యదర్శి జంపాల వెంకన్న దూపాటి జనార్ధన్, పిల్లి వీరయ్య, భిక్షమయ్య, వీరన్న, ఇల్లుటూరి వెంకన్న, పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఎస్సై

మరిపెడ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై సతీష్ అన్నారు. శనివారం గిరిపురంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి, పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయన్నారు. ప్రతీ క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

తొర్రూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. నాటి మధురస్మృతులు, ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గడిపారు. ఆనాటి గురువు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ మాట్లాడారు. గురువులను సత్కరించారు. గురువులు సంజీవరెడ్డి, కరుణసాగర్, మహ్మద్ అలీ, అంకం శ్రీను, విద్యార్థులు నిమ్మల రవి, రమేష్, దేవి, 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు.